పాఠశాలలో నీటి కష్టాలు ..

- ఒంటికి, రెంటికి వెళ్లేందుకు విద్యార్థులకు తిప్పలు
- ఇంటి నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు


పనిచేయని బోరు


వడ్ఝురి(బి) పాఠశాలలో ఇంటి నుంచి తీసుకొచ్చిన బాటిళ్లను చూపుతున్న విద్యార్థులు

తానూరు: మండలంలోని వడ్ఝురి(బి)గ్రామ ప్రాథమిక పాఠశాలలో నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలో ఏర్పాటు చేసిన బోరుమోటార్లు పని చేయడం లేదు. మిషన్ భగీరథ జలం సరఫరా కాకపోవడంతో గ్రామస్తులూ ప్రైవేటు వ్యక్తుల వద్ద నీటిని కొనుగోలు చేస్తున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న బోరుమోటారుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో విద్యార్థులు, మధ్యాహ్న భోజన కార్మికులు అవస్థలు పడుతున్నారు. రోజు విద్యార్థులు ఇంటి నుంచే తాగునీటిని సీసాల్లో తెచ్చుకుంటున్నారని విద్యార్థుల పోషకులు, ఉపాధ్యాయులు తెలిపారు.

నీరు లేక మరుగుదొడ్లు ఉపయోగించడం లేదు

నీటి వసతి లేక మరుగుదొడ్లు వినియోగించడం లేదని.. ఒంటికి, రెంటికి వస్తే విద్యార్థినులు ఇళ్లకు వెళ్లి వస్తున్నారని గ్రామస్తులు వాపోతున్నారు. 40 మంది విద్యార్థులు చదువుతున్న ప్రాథమిక పాఠశాలకు నీటి సౌకర్యం కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు వేడుకుంటున్నారు. పాఠశాల ఆవరణలో ఉన్న బోరుమోటారుకు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని పేర్కొంటున్నారు.

సమస్య పరిష్కరిస్తాం..

ఈ విషయమై ఎంపీడీవో శ్రీనివాస్ మాట్లాడుతూ సంబంధిత గ్రామపంచాయతీ కార్యదర్శితో మాట్లాడి బోరు మోటారుకు మరమ్మతులు చేయిస్తామని పేర్కొన్నారు.

బాటిళ్లలో తెచ్చుకుంటున్నాం



మా పాఠశాలలో నీటి సౌకర్యం లేదు. దీంతో ఇంటి నుంచి బాటిళ్లలో తెచ్చుకుంటున్నాం. మధ్యాహ్న భోజనం తర్వాత మళ్లీ ఇంటికి వెళ్లి వస్తున్నాం. నీటి సమస్య పరిష్కరించాలి. – ఆదిత్య, ఐదో తరగతి

ఇంటికి వెళ్లి వస్తున్నాం



పాఠశాలలో మరుగుదొడ్డి ఉన్నా నీటి సౌకర్యం లేక వినియోగించడం లేదు. దీంతో అందరం విరామ సమయంలో ఒంటికి, రెంటికి ఇళ్లకు వెళ్లి వస్తున్నాం. – ఆరాధ్య, ఐదోతరగతి

బోరు పని చేయడం లేదు



పాఠశాలలో ఉన్న బోరుమోటారు పని చేయడం లేదు. రోజు మధ్యాహ్న భోజనం తయారు చేసేందుకు ఇంటి నుంచి నీటిని తీసుకొస్తున్నాం. – ప్రణీత, మధ్యాహ్న భోజన కార్మికురాలు

తానూరు కేజీబీవీలో అధికారుల తనిఖీ

- సమస్యల పరిష్కారానికి హామీ

సాక్షి ఎఫెక్ట్..

తానూరు: మండల కేంద్రంలోని కేజీబీవీలో నెలకొన్న సమస్యలపై 'సాక్షి'లో కథనాలు ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన అధికారులు మంగళవారం తానూరు కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయం, భోసిలోని బీసీ వసతిగృహాన్ని మండల ప్రత్యేకాధికారి అషాక్‌హైమద్, ఎంపీడీవో శ్రీనివాస్‌రావ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీబీవీలో నెలకొన్న సమస్యలను ప్రిన్సిపాల్ అలేఖ్యను అడుగగా.. విద్యార్థినులకు సరి పడ మరుగుదొడ్లు లేవని.. భవనానికి తలుపులు, కిటికీలు లేకపోవడంతో రాత్రి భయాందోళన చెందుతున్నట్లు వారు తెలిపారు. మురుగు కాల్వల వ్యవస్థ సరిగా లేక నీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొన్నారు. సెప్టిక్‌ట్యాంక్ పగిలిపోవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన అధికారులు ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరించేలా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం భోసి బీసీ వసతిగృహానికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. వారి వెంట సంక్షేమాధికారి రాజు, సిబ్బంది తదితరులు ఉన్నారు.


మురుగు పరిశీలిస్తున్న అధికారి హైమద్

లైసెన్సు లేకుండా నడిపితే చర్యలు

- నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి


నిర్మల్‌లో మాట్లాడుతున్న డీఎస్పీ గంగారెడ్డి

నిర్మల్‌టౌన్: డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి హెచ్చరించారు. పట్టణ ట్రాఫిక్ పోలీస్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో మంగళవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 57 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూ.. పట్టణంలో కొందరు ట్రాఫిక్ చలాన్లు తప్పించుకునేందుకు, నంబర్ ప్లేట్ పెట్టుకోవడం లేదన్నారు. నంబర్ ప్లేట్ విరగొట్టినా, తప్పుగా రాసినా ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 19 మందికి రూ.500తో డ్రైవింగ్ లైసెన్స్ స్లాట్ బుక్ చేయించారు. పట్టణ సీఐ పురుషోత్తం, ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, పలువురు సిబ్బంది ఉన్నారు.

హత్‌గాంలో కార్డన్‌సెర్చ్

లోకేశ్వరం: నేరాలను నియంత్రించేందుకే నిర్బంధ తనిఖీలు నిర్వహిస్తున్నామని ముథోల్ సీఐ వినోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని హత్‌గాం గ్రామంలో తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్(కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగాం) నిర్వహించారు. గ్రామంలోని రైస్‌మిల్లు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ మాట్లాడారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహన చోదకులు అన్ని ధ్రువపత్రాలను వెంట ఉంచుకోవాలన్నారు. అంతకుముందు సరైన ధ్రువపత్రాల్లేని 78 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలకు జరిమానాలు విధించి వదిలిపెట్టారు.

అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి రావాలి..

రాబోయే రెండు రోజుల్లో వర్షాలున్నందున ప్రజలు అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. ఎస్సై సాయికుమార్, గణేశ్, రాహుల్, సాయికిరణ్, పోలీసులు ఉన్నారు.

నేరాల నియంత్రణకు కృషి చేద్దాం

కుంటాల: నేరాల నియంత్రణకు కృషి చేద్దామని భైంసా రూరల్ సీఐ నైలు పేర్కొన్నారు. మంగళవారం కుంటాల పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో నిర్వహించిన నెలవారి సమీక్షలో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడంతోపాటు దొంగతనాలు జరగకుండా రోజు పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. వారి వెంట ఎస్సై హన్మాండ్లు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సీజనల్ వ్యాధులపై అవగాహన

నర్సాపూర్(జి): దోమలు వ్యాప్తి చెందకుండా నిల్వనీటిని పారబోయాలని ఎంపీడీఓ అల్లాడి వనజ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నందన్, చాక్‌పల్లి, అర్లి(కె) గ్రామాల్లో డ్రైడేను పరిశీలించారు. కుస్లీ గ్రామంలో ఎంపీఓ శ్రీనివాస్‌గౌడ్ అవగాహన కల్పించారు. అనంతరం బయో గ్యాస్‌ప్లాంట్ ను పరిశీలించారు. కార్యదర్శులు వెంకటేశ్, నరేశ్ కుమార్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మామడ: మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రైడే నిర్వహించారు. కిషన్‌రావ్‌పేట్‌లో పంచాయతీ కార్యదర్శి విజయలలిత, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

పెంబి: మండలకేంద్రంతోపాటు నాగాపూర్, మందపల్లి, కోసగుట్ట గ్రామాల్లో డ్రై డే కార్యక్రమాలను మండల ప్రత్యేకాధికారి అంబాజీ పరిశీలించారు. పెంబి పెట్రోల్‌బంక్ ఎదుట ఉన్న నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయించారు. కోసగుట్ట ఆశ్రమ పాఠశాలకు వెళ్లి వంటగది, కంప్యూటర్, డిజిటల్ క్లాస్ రూంలను పరిశీలించారు. ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, ఎంపీవో రత్నాకర్‌రావు తదితరులు ఉన్నారు.

కుంటాల: ప్రజారోగ్యంపై దృష్టి సారించాలని ప్రత్యేకాధికారి మసార్‌రావు సూచించారు. మంగళవారం మండలంలోని అంబకంటి, అంబకంటి తండాలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కుంటాల పాఠశాలలో మన ఊరు- మన బడి పనులు పర్యవేక్షించారు. ఓలాలో సర్పంచ్ కనీష్‌ఫాతిమా పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. సర్పంచ్‌లు ప్రదీప్‌కుమార్, జాదవ్ శంకర్, ఎంపీడీవో దేవేందర్ రెడ్డి, ఎంపీటీసీ సుధాకర్, కార్యదర్శులు ఉత్తం, యోగేష్, సతీష్ పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆలూరు, బోరిగాం, యాకర్‌పెల్లి గ్రామాల్లో ఎంపీడీఓ సరోజ పర్యటించారు. ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. మన ఊరు–మనబడి పనులు, ఆరోగ్య ఉపకేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆరోగ్య ఉపకేంద్రాలను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. ఏపీఓ లక్ష్మారెడ్డి, కార్యదర్శులు లింగయ్య, స్రవంతి, రాజ్‌మోహన్, ఏఎన్‌ఎం సుప్రత్‌ఖానం ఉన్నారు.

లక్ష్మణచాంద: మండల కేంద్రంలోని వీధుల్లో నిల్వ నీటిని ఎంపీవో నసీరుద్దీన్ పారబోయించారు. విక్రమ్ రాజ్, సుగుణ, వనజ పాల్గొన్నారు.

దస్తురాబాద్: మండలంలోని మల్లాపూర్‌లో సీజనల్ వ్యాధులపై ఎంపీడీవో విజయ్‌భాస్కర్‌రెడ్డి అవగాహన కల్పించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. సర్పంచ్ భూమేష్, ఎంపీవో అనిల్, ఆరోగ్యవిస్తరణాధికారి వేణుగోపాల్, రవీందర్, సిబ్బంది పాల్గొన్నారు.


కుంటాల: నిల్వనీటిని పారబోస్తున్న సిబ్బంది


ఆలూరులో సారంగపూర్ ఎంపీడీఓ సరోజ పరిశీలన

ప్రమాదమైనా.. సరుకులు తెచ్చుకోవాల్సిందే

కడెం: వర్షాకాలంలో మారుమూల గ్రామాల ప్రజలు మరో ఊరికి వెళ్లాలంటే సాహసం చేయాల్సిందే. కడెం మండలంలోని ఉడుంపూర్ పంచాయతీ లోని మిద్దెచింతకు రోడ్డు సౌకర్యం లేదు. ఉడుంపూర్ నుంచి బండ్లబాటతో రెండు కిలోమీటర్లు..రెండు వాగులు దాటితేనే ఈ గ్రామం చేరుకోవచ్చు. ప్రస్తుతం వర్షాలకు ఈ వాగులు పొంగిపోర్లుతుండటంతో గ్రామస్తులు ఊరు విడిచి బయటకు వెళ్లడం లేదు. అత్యవసరమైతే వృద్ధులు, చిన్నారులతో ఇబ్బందే. 150 మంది ఉన్న ఈ గ్రామంలో చిన్న కిరాణం కూడా లేదు. మంగళవారం సరుకుల కోసం ఉడుంపూర్‌కు మడ వాగు దాటి వచ్చారు. ఇలా ప్రమాదకరంగా వాగు దాటుతున్నారు.


ఒకరికొకరు తోడుగా వాగు దాటుతున్న ప్రజలు

'వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి'

సారంగపూర్: వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చి వడ్డెరబంధు అమలు చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు సంపంగి ప్రభాకర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆ సంఘం సభ్యులతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1977లో డీ నోటిఫైడ్ జాబితాలో వడ్డెరకులం గిరిజనుల తెగల్లో విలీనమై ఉందని గుర్తు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధర్, మండలాధ్యక్షుడు శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు తుమ్మిశెట్టి శ్రీనివాస్, సాయిలు, పోశెట్టి, వీరయ్య, ఎల్లయ్య, గురు, తదితరులు ఉన్నారు.

బోనాల పండుగ

భైంసారూరల్: మండలంలోని లింగా–1లో మంగళవారం బోనాల పండుగ నిర్వహించారు. గ్రామదేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు బోనాలు ఎత్తుకొని ఆలయాలకు వెళ్లి నైవేద్యం సమర్పించారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో గేదె మృతి

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ గ్రామంలో గన్నె కొమురయ్యకు చెందిన గేదె సోమవారం రాత్రి విద్యుదాఘాతంతో మృతి చెందింది. విద్యుత్ స్తంభం సపోర్ట్ వైరుకు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గేదె విలువ రూ.నలభై వేలు ఉంటుందని.. ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతు వేడుకున్నాడు.

ఆలయానికి విరాళం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీ మహాలక్ష్మి ఆలయ అభివృద్ధికి మంగళవారం ఇంద్రనగర్‌లోని మాల సంఘం ఆధ్వర్యంలో రూ.15వేల విరాళం అందజేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతుగా సహకారం అందజేసినట్లు సంఘ సభ్యులు పేర్కొన్నారు. కమిటీ సభ్యులు సతీష్‌రావు దేశ్‌పాండే, పంబాల భీమేశ్వర్, రాజేశ్వర్, రాజశేఖర్, నేత శ్యాం, శ్రీకాంత్, సతీశ్ తదితరులు ఉన్నారు

మొక్కలు పంపిణీ

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడలో మంగళవారం రిలయన్స్ ఫౌండేషన్ డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో రైతులకు బంగినపల్లి మామిడి, తైవాన్ జామ మొక్కలు పంపిణీ చేశారు. సర్పంచ్ చెన్న మహేశ్, మాక్స్ అధ్యక్షుడు అల్చెట్టి మహేశ్, సొసైటీ కోఆర్డినేటర్ మురళీ, ఫీల్డ్ అసిస్టెంట్ సంతోష్ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'

ఖానాపూర్: గ్రామీణ ప్రాంతాల్లో సమస్యలు పరిష్కరించడంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షురాలు చారులత రాథోడ్ అన్నారు. మండలంలోని బాదనకుర్తి, సుర్జాపూర్ గ్రామాల్లో వారు పర్యటించారు. చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ బురదమయం అవుతున్నాయన్నారు. వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలని కోరారు. లక్ష్మీరాజం, సాయిరాజ్ తదితరులు ఉన్నారు.

'భాష్యం'లో కార్గిల్ దివస్


నివాళులర్పిస్తున్న విద్యార్థులు

నిర్మల్‌టౌన్: కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకొని మంగళవారం జిల్లా కేంద్రంలో నిభాష్యం హైస్కూల్‌లో విద్యార్థులు అమర వీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. పాఠశాల ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రియా కపిల్, కరస్పాండెంట్ కౌశిక్, స్వప్న, ప్రిన్సిపాల్ ప్రశాంత్ పాల్గొన్నారు.

ఉద్యాన పంటలపై అవగాహన

తానూరు: మండలంలోని ఝరి(బి)లో మంగళవారం ఏఈవో రమేశ్ ఉద్యాన పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి పథకం కింద రాయితీపై 14 రకాల పండ్ల తోటలు సాగు సాగుచేసుకోవచ్చని సూచించారు. ఆసక్తి కల్గిన రైతులు ఈనెల 31లోగా దరఖాస్తులు చేసుకుంటే మొక్కలను అందిస్తామన్నారు.

నిందితులను శిక్షించాలి

నిర్మల్‌టౌన్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలు, యువతులపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులను శిక్షించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విలాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలో గాంధీ పార్కులోని గాంధీ విగ్రహం వద్ద సీపీఐ, సీపీఎం నాయకులు నిరసన వ్యక్తం చేశారు. నూతన్ కుమార్, యస్.ఎన్.రెడ్డి తదితరులున్నారు.

మణిపూర్ ఘటనపై కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇంచార్జ్ కన్వీనర్ సయ్యద్ హైదర్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేశారు. పార్టీ పట్టణ కన్వీనర్ రవీందర్, కోకన్వీనర్ సాయికుమార్, షబానా బేగం తదితరులు పాల్గొన్నారు.

బెల్‌తరోడాను మండలంగా ఏర్పాటు చేయాలని వినతి

తానూరు: మండలంలోని బెల్‌తరోడా గ్రామాన్ని మండలంగా ఏర్పాటు చేయాలని కోరుతూ మంగళవారం 12 గ్రామాల బీఆర్‌ఎస్ కార్యకర్తలు, సర్పంచ్‌లు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువేళ్లి బెల్‌తరోడా మండలంగా ఏర్పడేలా చూస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీపీ బాశెట్టి రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు పోతారెడ్డి, బెల్‌తరోడా సర్పంచ్ సాయినాథ్ తదితరులు ఉన్నారు.

బీసీలకు సాయం అందించాలి

భైంసాటౌన్: దరఖాస్తు చేసుకున్న బీసీ కుల వృత్తులవారికి వెంటనే రూ.లక్ష ఆర్థిక సాయం పంపిణీ చేయాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాలోడ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావుపటేల్ ఆదేశాల మేరకు రామారావుపటేల్ యువసేన ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బాలాజీ పటేల్, అమూల్, హన్మాండ్లు, రఘు తదితరులున్నారు.

చలో హైదరాబాద్‌కు తరలిరండి

భైంసాటౌన్: బీడీ కార్మిక హక్కుల సాధన కోసం వచ్చే నెల 4న చేపడుతున్న చలో హైదరాబాద్‌కు తరలివచ్చి కార్యక్రమం విజయవంతం చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి కె.రాజన్న పిలుపునిచ్చారు. పట్టణంలోని పిప్రికాలనీ బీడి కార్ఖానాలో మంగళవారం ఆయన మాట్లాడారు. పీఎఫ్ పెంపు, బీడీ కార్మికులకు జీవనభృతి, బీడీ పరిశ్రమపై జీఎస్టీ ఎత్తివేత, తదితర డిమాండ్ల సాధనకు ఆగస్టు 4న హైదరాబాద్‌లో కార్మికసభ నిర్వహించనున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు బక్కన్న, లక్ష్మి, రామ్‌లక్ష్మణ్, గఫూర్ తదితరులున్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి రాజన్న

అభివృద్ధిని ఓర్వలేకనే విమర్శలు

ఖానాపూర్: సీఎం కేసీఆర్ పాలనలో రైతుల అభివృద్ధిని ఓర్వలేకనే కాంగ్రెస్, బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్యే అజ్మీరా రేఖానాయక్ అన్నారు. మండలంలోని బాదనకుర్తి పంచాయతీ పరిధిలోని చింతల్‌పేట్ గ్రామ రైతువేదికలో మంగళవారం రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం అక్కడే పలు మొక్కలు నాటారు. కార్యక్రమంలో సర్పంచ్ పార్శపు శ్రీనివాస్, ఉపసర్పంచ్ మాదాసు నవీన్, వాల్‌సింగ్, రాజగంగన్న, పుప్పాల శంకర్, గొర్రె గంగాధర్, శ్రీనివాస్, స్వామి, ఆకుల సురేశ్, సాయిరాం, రాజన్న తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేఖానాయక్

పాతపెన్షన్ పునరుద్ధరించే వరకు పోరాటం

నిర్మల్‌రూరల్: పాతపెన్షన్ విధానం పునరుద్ధరణ చేసే వరకు తమ పోరాటం కొనసాగుతుందని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు గంగాపురం స్థితప్రజ్ఞ అన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానం కొనసాగించాలని చేపట్టిన పాతపెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర సోమవారం రాత్రి నిర్మల్ చేరింది. అంతకుముందు జిల్లాకేంద్రంలో సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కొండన్నగారి కష్టారావు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. ఆగస్టు 12న నిర్వహించే చలో హైదరాబాద్‌కు తరలిరావాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం భూమన్న, రాష్ట్ర సహాధ్యకులు పంతిక రేవంత్, వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

భైంసాటౌన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తపస్ జిల్లా అధ్యక్షులు టి. నవీన్ కుమార్ డిమాండ్ చేశారు. తపస్ ఆధ్వర్యంలో మంగళవారం భైంసాలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఉపాధ్యాయ ఉద్యమ జాగరణలో భాగంగా వచ్చే నెల 19 వరకు ఉద్యమ కార్యాచరణ ఉంటుందన్నారు. రాజేశ్వర్, చంద్రప్రకాశ్, సాయన్న తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్‌రూరల్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ ఉద్యమ జాగరణ కార్యక్రమం చేపట్టారు. నిర్మల్‌రూరల్ తహసీల్దార్ ప్రభాకర్‌కు అపరిష్కృత సమస్యలపై మంగళవారం వినతిపత్రం అందించారు. తపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.సుదర్శన్, సాయన్న, సురేశ్‌రెడ్డి, విజేశ్ పాల్గొన్నారు.

కుభీర్: తపస్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ పద్మకు వినతిపత్రం అందజేశారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షులు నవీన్, ప్రధాన కార్యదర్శి రాసం రాజేశ్వర్, జిల్లా గౌరవ అధ్యక్షులు రాజేశ్వర్, దత్తుపటేల్, రవీందర్, సాయన్న తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

కేంద్ర పథకాలపై అవగాహన

కుభీర్: మండలంలోని బెల్గాం, బెల్గాం తండా, దార్ కుభీర్‌లో మంగళవారం గడప గడపకూ బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు భోస్లే మోహన్‌రావు పటేల్ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించే కరపత్రాలు పంపిణీ చేశారు. సుభాశ్‌పటేల్, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాధర్, అజయ్, మనోజ్, జి.శ్రీనివాస్, గంగాధర్, సాయినాథ్, హన్మంతు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు గోవర్ధన్ అన్నారు. మంగళవారం మండలంలోని పార్‌పెల్లి గ్రామంలో కార్యకర్తలతో మాట్లాడారు. మండల ఉపాధ్యక్షుడు రంజిత్, ముత్యంరెడ్డి, చిన్నయ్య, పోశెట్టి పాల్గొన్నారు.

'సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి'

భైంసారూరల్: మండలంలోని హంపోలి గ్రామంలో సర్వే నెంబర్ 16/ఆలో ప్రభుత్వం ఇచ్చిన ఇండ్ల స్థలాలను మరొకరికి అక్రమ పట్టా చేసిన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం హంపోలిలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అక్రమ పట్టా భూమిని పరిశీలించారు. సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి జిల్లా కార్యదర్శి జె రాజు, జిల్లా కమిటీ సభ్యులు హరిత, వెంకటనారాయణ, గోపి నర్సయ్య, వెంకటేశ్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు స్వామి, గుట్ల ప్రసాద్, దీనాజీ, విఠల్, అనిల్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పంటను రక్షించుకోవాలి

పెంబి: పంటలను తెగుళ్ల బారిన పడకుండా సంరక్షించుకోవాలని ఏఈవో రాజ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని తాటిగూడలో క్షేత్రస్థాయిలో పంటలను పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. సర్పంచ్ తానాజీ, టికాజీ, సీఆర్‌డీ ప్రతినిధి మహేందర్, రైతులు హేమ, రాజేందర్ ఉన్నారు.

వెండి కిరీటం బహూకరణ

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీ ముత్యాల పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పట్టణానికే చెందిన జాదవ్ భీంసింగ్ మంగళవారం వెండి కిరీటం బహూకరించాడు. ఆలయంలో పూజలు చేసి అర్చకుడు శరత్‌చంద్రకు అందజేశారు.

వడ్డాణం బహూకరణ

లోకేశ్వరం: మండల కేంద్రానికి చెందిన నాయక్‌పోడ్ సంఘం సభ్యులు మంగళవారం స్థానిక పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారికి 12 తులాల వెండి వడ్డాణం అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు నవీన్, నాయక్‌పోడ్ సంఘం సభ్యులు మురళి, నరేశ్, జగదీశ్, ప్రశాంత్, తేజ తదితరులున్నారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంటలో ఈవీఎంల వినియోగం, ఓటు హక్కు ప్రాధాన్యంతపై తహసీల్దార్ లక్ష్మి ప్రజలకు అవగాహన కల్పించారు. వైస్ ఎంపీపీ రాజునాయక్, డిప్యూటీ తహసీల్దార్ తెలంగరావ్, ఆర్ఐ వెంకటనర్సయ్య తదితరులు న్నారు.

కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం

లోకేశ్వరం: తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో మంగళవారం వీఆర్‌ఏలు సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేం చేశారు. గంగన్న, జలేందర్, భోజన్న, లక్ష్మణ్, సాగర్, సులోచన, సునంద, రాజు ఉన్నారు.

తానూరు: తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌ఏలు కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పీర్ హైమద్, గ్రామాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ముధోల్: తహసీల్దార్ కార్యాలయంలో సీఎం కేసీఆర్, ముధోల్ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి చిత్రపటానికి వీఆర్‌ఏలు క్షీరాభిషేకం చేశారు.

దొడర్నాలో వైద్యశిబిరం

కుభీర్: మండలంలోని దొడర్నా ఆశ్రమ పాఠశాలలో మంగళవారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందించారు. డాక్టర్ ప్రణయ్, సూపర్‌వైజర్లు సాయిబాబా, శ్రీనివాస్ ఏఎన్ఎంలు తదితరులు ఉన్నారు.

'సెల్ఫ్ అఫిడవిట్ తీసుకోవాలి'

ఖానాపూర్: పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో డబుల్‌బెడ్‌రూం ఇళ్లు పొందిన వారిలో అనర్హులను తొలగించేందుకు అధికారులు వారి నుంచి తమకు ఇళ్లు, ఆస్తులు లేవని సెల్ఫ్ అఫిడవిట్ తీసుకోవాలని డబుల్‌బెడ్ రూం దరఖాస్తుదారులు కోరారు. మంగళవారం తహసీల్దార్, మున్సిపల్ కార్యాలయాల్లో వినతిపత్రాలను అందజేశారు. రాజశేఖర్, శంకర్, మజీద్‌ఖాన్, భూమేశ్, ఇమ్రాన్ ఉన్నారు.

పరామర్శ

భైంసాటౌన్: ఆదిలాబాద్‌లో మాజీ మంత్రి సి.రామచంద్రారెడ్డి కుటుంబసభ్యులను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావుపటేల్ పరామర్శించారు. నారాయణరెడ్డి, గంగారెడ్డి తదితరులున్నారు.

శీత్లాభవాని వేడుకలు

ఖానాపూర్: మండలంలోని దాసునాయక్ తండాలో మంగళవారం బంజారా గిరిజనులు శీత్లాభవాని వేడుకలు నిర్వహించారు.

పెంబి: మండలంలోని పుల్గంపాండ్రి, లోతర్యతాండ, ఇటిక్యాల్, పెంబితాండ గ్రామాల్లో శీత్లాభవానీ పండుగ నిర్వహించారు. బీఆర్‌ఎస్ నాయకుడు జాన్సన్ నాయక్ హాజరవగా వారికి ఘనస్వాగతం పలికారు. మల్లేశ్, నర్సయ్య తదితరులు ఉన్నారు.